
కథ

రామవరపు గణేశ్వరరావు

# హంతకులు చేసిన అద్భుతం

**డాక్టర్లకు కూడా గ్రూపులంటూ వుంటాయి. వారంతా అప్పుడప్పుడూ ఒకచోట కలుసుకుని, తమ సమస్యలని చెప్పుకుంటూ వుంటారు. వారి సమావేశాలు కొన్ని రహస్యంగానే జరుగుతుంటాయి. బహుశా వాటి ఉద్దేశం ఆ డాక్టర్లకు తెలిసింది ఎంతో, తెలియనిది ఎంతో. అందరికి తెలియకుండా వుంచడానికేమో!**



చాలా కాలం క్రితం అలా రహస్య సమావేశాలు నిర్వహించే ఒక మెడికల్ గ్రూప్ న్యూయార్క్‌లో వుండేది. దాని పేరు 'X' క్లబ్. మూడు నెలలకొక సారి క్రమం తప్పకుండా కొన్నేళ్లుగా ఒక హోటల్ రూంలో కలుసుకుంటూ వుండేవారు. తెల్లవార్లూ ఆ మూసిన గదిలో వారి చర్చలు జరిగేవి.

క్రితంసారి 'X' సమావేశం ఒక వర్షం పడుతున్న రాత్రి జరిగింది. పద్నాలుగుమంది సభ్యులు అందరూ ఒక చోట చేరారు. ఆరాత్రి వారి క్లబ్‌లో ఒక కొత్త సభ్యుడు చేరబోతున్నాడు. పేరు డాక్టర్ శామ్... వయస్సులో అందరి సభ్యులకన్నా చిన్న వాడే! అతన్ని తమ క్లబ్‌లోనికి ఆహ్వానించిన వారందరూ సీనియర్ సర్జన్లే. తమతమ రంగాలలో ఎంతో ప్రఖ్యాతి చెందినవారే! అందులో సగం మంది శామ్ స్వయంగా ఆరాధించే వ్యక్తులే!

శామ్ ఒక మూల ఒదిగి కూర్చున్నాడు. తన ముందున్న డ్రింక్ ముట్టుకోలేదు. అతని మొహంలో ఏదో ఉద్రిక్తత, పరుగుపోటీ ప్రారంభం కాగానే ముందుకు దూకాలన్న ఆత్రుత కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.

తొమ్మిదికల్లా డాక్టర్ విలియమ్ క్లబ్ సమావేశాన్ని మొదలుపెట్టారు. 'డాక్టర్ శామ్, మన క్లబ్ లక్ష్యం గురించి మీకుచెప్పాలి. మనలో ఎవరి వల్ల నైనా 'హత్య' జరిగితే... ఐ మీన్ మెడికల్ మర్డర్ ... అతను దాన్ని ఇక్కడ అందరి ముందూ చెప్పుకోవాలి. నిజానికి ఏదో ఉద్రేకంలో చేసిన హత్య గురించి వినడానికి మనం అంతా ఇష్టపడతాం కానీ మూర్ఖత్వం వలన జరిగిన దాని గురించి కాదు! అయితే. సరిగ్గా రోగ నిర్ధారణ చేయకుండా, చేసిన చికిత్స వికటించి రోగి మరణిస్తే, అది హత్యతో సమానమే కదా! ఆ ట్రీట్‌మెంట్ చేయకుండా వుంటే, రోగి నిండా నూరేళ్లు బతికి వుండే వాడేమో! అలాంటి కేసులను మనం ఈ క్లబ్‌లో చర్చిస్తాం!'' అన్నాడు.

''సర్, ఇలాంటి సమావేశానికి హాజరవడం నాకైతే మొదటిసారే.'' నెమ్మదిగా అంటూ వెనువెంటనే గొంతు పెంచి, ''కానీ, నేను చెప్పదలుచుకున్న ముఖ్య విషయం ఒకటి వుంది. సర్, చెప్పమంటారా?'' అన్నాడు డాక్టర్ శామ్.

''అది హత్యేనా?'' డాక్టర్ విలియం అడిగాడు.

''ఔను'' కళ్లు కిందికి దించి గొణిగాడు శామ్.

''మంచిది'' తలపంకించి, ''తప్పకుండా చెప్పండి. వింటాం. కాని మన ఎజెండాలో మాకన్నా ముందు ఇంకో ఇద్దరు హంతకులున్నారు!''

ఆ క్షణంలో డాక్టర్ శామ్ మొహంలో మామూలుగా కనిపించే బెరుకుతనానికి మించిన ఉద్రిక్తత ఏదో అందరికీ కనిపించింది. దారుణమైన 'హత్య' ఏదో చేసి, అది చెప్పి తన మనోభారం తగ్గించుకోవడానికి అతడు మీటింగ్‌కి వచ్చి వుంటాడని అక్కడి వారంతా భావించారు.

న్యూరాలజిస్ట్ ఫిలిప్, శామ్ భుజం మీద చెయ్యి వేస్తూ ''ఎన్నో ఘోరమైన అపరాధాలే మా వల్ల జరిగాయి.'' అతన్ని అనునయించడానికి అన్నాడు.''

''డాక్టర్ శామ్‌కు ధైర్యం చెప్పాలనుకుంటే, మీటింగ్ అయ్యాక చెప్పండి. మీటింగు మధ్యలో కాదు. ఏదో అపరాధభావంతో బాధపడుతున్న వారికిది ఆరోగ్య కేంద్రం కాదు. మెడికల్ నేరాలకి మాత్రమే మన 'క్లబ్ ఓ క్లినిక్ లాంటిది. అంటే దీని లక్ష్యం ఆయా కేసుల్లోని శాస్త్రీయ మూలాలు కనిపెట్టడమే! మొట్టమొదటి కేసు డాక్టర్ డేవిడ్‌ది!'' అని కూర్చున్నాడు విలియం.



డాక్టర్ డేవిడ్ జీర్ణకోశ వ్యాధుల నిపుణుడు. తను లేచి నిల్చోగానే అంతటా నిశ్శబ్దం పులుముకుంది. ''గత వేసవిలో ఒక రాత్రి హేరీ ఇంటి నుంచి పిలుపు వచ్చింది. ఒక రాజకీయనాయకుడు తన నియోజక వర్గంలోని చాలా మందికి పార్టీ ఇచ్చారు. ఆ పార్టీకి వెళ్లిన హేరీ కుటుంబం లోని ముగ్గురు వ్యక్తులకు ఫుడ్ పాయిజినింగ్ అయింది. ఆ లీడరు బలవంతం మీద హేరీ ఇంటికి వెళ్లాను. పెద్దవాడికి 11 ఏళ్లు, రెండో వాడికి 9 ఏళ్లు, ఇద్దరూ విపరీతంగా వాంతులు చేసుకుంటున్నారు. పార్టీలో వాళ్లు ఏయే పదార్థాలు తిన్నారో, ఆ వివరాలన్నీ వాళ్ల అమ్మ ఇచ్చింది. అదో పెద్ద లిస్టే! ఆ పిల్లల కడుపులోని గడబిడకు కారణం అదే! ఇద్దరి చేత ఆముదం తాగించాను. టేబ్లెట్స్ ఇచ్చాను అందరికన్నా చిన్నవాడికి ఏడేళ్లు. వాడికంత సుస్తీ చేయలేదు. చూడడానికి మొహం కొద్దిగా పాలిపోయి వుంది.... కొద్దిగా టెంపరేచర్. వాంతి వచ్చినట్టు వుందని అన్నాడు కానీ వాంతి చేసుకోలేదు. వాడిలోనూ ఫుడ్‌పాయిజినింగ్ లక్షణాలు కనిపించి, కేస్టర్ ఆయిల్ డోసు ఇచ్చాను.

''అర్ధరాత్రి పిల్లాడి తండ్రి మళ్లీ ఫోన్ చేశాడు. పెద్ద పిల్లలిద్దరి పరిస్థితి మెరుగైందట. కాని ఆఖరి వాడి పరిస్థితి ఆందోళనకరంగా వుందని అన్నాడు. చిన్నవాడిలో కొంచెం ఆలస్యంగా ఫుడ్‌పాయిజనింగ్ లక్షణాలు బయటపడుతున్నాయని మర్నాడు పొద్దునకల్లా అంతా సర్దుకుంటుందని, కంగారు పడవలసిన అవసరం లేదని చెప్పాను. ఫోన్ పెట్టేసి, పెద్దపిల్లలిద్దరూ కోలుకున్నారు కనుక, నా చికిత్స సరైనదే అని సంతృప్తి చెందాను.

''మర్నాడు పెద్దపిల్లలిద్దరికీ పూర్తిగా నయం అయింది. చిన్నవాడి పరిస్థితి నిజంగానే ఆందోళనకరంగా వుంది. కళ్లు బాగా లోతుకుపోయాయి. చుట్టూ నల్లటి వలయాలు... ముక్కుపుటాలు పెద్దవయ్యాయి...పెదాలు నీలంరంగులోకి మారాయి. రక్తంలో ప్రాణవాయువు ప్రసరణ తగ్గడంతో, శరీరం తేమతోనిండి చల్లబడిపోయింది!'' డాక్టర్ డేవిస్ ఒక్క క్షణం ఆగాడు.

గుండెవ్యాధి నిపుణుడు మిల్టన్, ''కొన్ని గంటల వ్యవధిలో ఆ పిల్లవాడు పోయుండాలే!'' అన్నాడు.

డేవిస్ తలపంకించాడు.

''సరిగ్గానే ఊహించావు. మీరు చూసినప్పుడు

ఆ క్షణంలో డాక్టర్ శామ్ మొహంలో మామూలుగా కనిపించే బెరుకు తనానికి మించిన ఉద్రిక్తత ఏదో అందరికీ కనిపించింది. దారుణమైన 'హత్య' ఏదో చేసి, అది చెప్పి తన మనోభారం తగ్గించుకోవడానికి అతడు మీటింగ్‌కి వచ్చి వుంటాడని అక్కడి వారంతా భావించారు.

బహుశా ఆ కుర్రాడు అపెండిసైటిస్‌తో బాధప డుతూ వుండి వుండవచ్చు. అది తెలుసుకోలేక మీరేమో కేస్టర్ ఆయిల్ ఇచ్చారు. దానితో అపెండిక్స్ పగిలిపోయింది. అది వాడి ప్రాణాలు తీసింది.'' మిల్టన్ అన్నాడు.

''ఔను అలాగే జరిగింది'' డేవిస్ నెమ్మదిగా గొణిగాడు.

''ఇది ఆముదం చేసిన హత్య.'' అని తీర్పు ఇస్తూ డాక్టర్ విలియం, డాక్టర్ వుడ్ కేసి చూశాడు. ఇవాళ తమ క్లబ్‌లో చేరబోతున్న శామ్ కేసి చూస్తూ, ''గాల్ బ్లేడర్స్ అనే చేదు తిత్తి గురించి నీకు తెలుసు కదా, శామ్! ఒక అర్ధరాత్రి రోగిని తీసుకొచ్చారు నా దగ్గరకి. కుడివైపు పొట్టలో నొప్పి వస్తూ పోతూ వుంది. బాధతో ఆమె మెలికలు తిరి గిపోతోంది.! నొప్పి తగ్గడానికి మందిచ్చాను. ఆమెకు కాని పొద్దునకల్లా నొప్పి తీవ్రతవల్లనేమో పిత్తాశయానికి చిల్లులు పడ్డాయనుకుంటా... ఓ గంటలో ఆమె ప్రాణాలు పోయాయి.'' అన్నాడు.

''శవ పరీక్షలో ఏం తేలింది?'' పక్కనే వున్న ఒక సర్జన్ అడిగాడు.

''ఒక్క క్షణం ఆగండి. మన సమావేశ సంప్ర దాయం ప్రకారం అది ఎలా జరిగిందో చెప్పవల సింది మీరు!'' వుడ్ జవాబిచ్చాడు.

''రోగి మెడికల్ హిస్టరీ తీసుకున్నారా?'' అడి గాడు ఇంకో సభ్యుడు.

''లేదు. ఎమర్జన్సీ కేసు... అంత టైము దొరకలే దు.''

''అదీ అసలు సంగతి! మీరంతా ఈ పాటికి గ్రహించే వుంటారు. డాక్టర్ వుడ్ ఒక స్త్రీని హత్య చేశాడు. పేషెంట్ నొప్పి తీవ్రతను తప్పుగా అర్థం చేసుకున్నాడు. ఆమె పడిన బాధకు మూలం గమ నించలేకపోయాడు. గాల్ బ్లేడర్ కాక అంత నొప్పి శరీరంలోని మరే భాగం కలిగించగలదు. డాక్టర్!'' అధ్యక్షుడు అడిగాడు.

''గుండె!'' టక్కున ఒక సర్జన్ చెప్పాడు.

''మీ ఊహ సరైన దారిలోనే నడుస్తోంది. గుండెకు కుడివైపు వున్న రక్తనాళంలో రక్తప్రసస రణ సరిగ్గా లేక, పేషెంట్ గుండె ఆగిపోయినట్లు అటాప్సీలో తేలింది.'' అని డాక్టర్ వుడ్ చెప్పాడు. ''సరైన సమయంలో నేను శస్త్ర చికిత్స చేసుంటే ఆమె బతికేది.''

''నిస్సందేహంగా ఇది హత్యే. మెడిసిన్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి చేసినట్లుంది.'' ఒక సీనియర్ సర్జన్ కోపంగా అన్నాడు.

''ఇంత వరకూ రెండు కేసులు విన్నాం. రెండూ నేరాలే! వీటి నుంచి మనం నేర్చుకోవలసిన పాఠం ఏదన్నా వుందా? వుంటే అది ఒకటీ- సైన్స్-స్టుపిడిటీ, జ్ఞానం-అజ్ఞానం కలిసికట్టుగా వుంటాయని! సరే, ఇప్పుడు మన ముందు ఒక కుర్ర సర్జన్ వున్నాడు. పిట్టకొంచెం కూత ఘనం అన్నట్లు చిన్నవయసులోనే మెడికల్ జీనియస్‌గా గుర్తింపు పొందాడు. మరి ఇతని వలన ఏదైనా మెడికల్ మర్డర్ జరిగుంటే, దానిని నా విద్యార్థి నులు పెట్టిన పేరు 'హానీ' తో పిలుచుకుందాం. చూస్తున్నారుగా! ఇంతసేపటి నుంచి నిజమైన హంతకునిలా మానసిక క్షోభ చెందుతూ, చెమటతో తడుస్తూ, ఎలా అసహనంగా సీట్లో కదులుతున్నా డో!... ఓకే మైడియర్ ఫ్రెండ్స్, ఇక మనం, అతి చిన్న వయసులోనే నేరం చేసిన డాక్టర్ శామ్ చెప్పేది విందాం!'' అని అధ్యక్షుడు అన్నాడు.

డాక్టర్ శామ్ తడిసిన రుమాలుతో తన మొహం, మరోసారి తుడుచుకున్నాడు. గొంతు సవరించుకున్నాడు.

''రోగి ప్రతిభావంతుడైన ఒక యువకుడు. 17 ఏళ్ల వయసు, కవితలు రాస్తాడు. రెండు వారా లుగా ఒంట్లో బాగాలేక నా దగ్గరకొచ్చాడు. అతని జ్వర తీవ్రతను చూసి వెంటనే హాస్పిటల్‌లో చేర్పించాను. ఎడమవైపు పొత్తికడుపులో విపరీ తంగా నొప్పి రావడంతో మొదలైంది అతని అస్వస్థత. వెంటనే నన్ను పిలుద్దామనుకున్నాడు. కాని నొప్పి మూడు రోజుల తరువాత తగ్గిపోవ డంతో ఆ ఆలోచన మానుకున్నాడు. తనకు పూర్తిగా నయమైపోయిందని! విరేచనాలు పట్టుకు న్నాయి. అయితే మెడికల్ రిపోర్టులో హానికరమైన బాక్టీరియా లేదు. అతని వ్యాధి లక్షణాలు చూసి పెద్దపేగులో పుండు పడివుంటుందని నిర్ధా రించాను. అపెండిసైటిస్ కేసులా అనిపించలేదు. పేషెంట్‌కి సల్ఫాసలైజన్ ఇచ్చి, ద్రవ పదార్థాలు మాత్రం తీసుకోమన్నాను. నా చికిత్స పనిచేయ లేదు. పేషెంట్ పరిస్థితి విషమించింది. పొత్తి కడు పంతా మెత్తబడిపోయి, జవజవలాడింది. రెండు వారాలు ఎంతో జాగ్రత్తగా ట్రీట్‌మెంట్ ఇచ్చినప్ప టికీ పేషెంటు చనిపోయాడు.'' అని డాక్టర్ శామ్ ముగించాడు. మరోసారి రుమాలుతో మొహం మీద పట్టిన చెమటను తుడుకున్నాడు.

''మీరు చేసిన రోగ నిరారణ తప్పని శవపరీ క్షలో తెలిసిందా?'' ఒక సర్జన్ అడిగాడు.

''పోస్టుమార్టమ్ చేయలేదు. అతడి తల్లి దండ్రులకు నా మీదెంతో గురి. పేషెంట్‌కి నా మీదున్న అచంచల విశ్వాసంలాగే! డాక్టర్‌గా నేను చేయగలిగిందంతా చేశానని, రోగి ప్రాణాలు రక్షించ డానికి నా శాయశక్తులా పోరాడానని, వారంతా నమ్మారు.'' శామ్ జవాబిచ్చాడు.

''మరి మీ రోగ నిర్ధారణ సరైంది కాదని ఎందు కనుకుంటున్నారు. పేషెంట్ చావుకి వేరే కార ణాలు వుండవచ్చు కదా!'' మరో డాక్టర్ అన్నాడు.

''మరేం అనుకోవాలి?'' విసుగ్గా శామ్ అన్నా డు. బాగవడానికి బదులు రోగి మరణించాడు కదా! నా డయాగ్నిసిస్ తప్పు అవడంతో అతని చావుకు కారణమయ్యాను'' అని తల కిందికి దించుకున్నాడు.

''ఔను, మీరంటున్నది సహేతుకంగానే వుంది.'' అంటూ డాక్టర్ స్వీనీ తలపంకించాడు.

''సరే, ఇక అసలు విషయానికి వద్దాం.'' టేబిల్ వెనక నుంచి అధ్యక్ష స్థానంలోంచి విలి యమ్ అన్నాడు....ప్రతిభావంతుడైన మన నూతన సభ్యుడు కాబోయే ఒక మహాకవిని పైకి పంపించే శాడు. అతను చేసిన రోగనిర్ధారణ ఏవిధంగా తప్పో, ఆపరిస్థితుల్లో అతడు ఏం చేస్తే ఈ నేరం జరిగుండేది కాదో విచారించాల్సిన బాధ్యత మనందరిపైనా వుంది.''

''రోగి మరణించి ఎన్ని రోజులవుతోంది?'' డాక్టర్ రోసన్ అడిగాడు.

''గత బుధవారం...అయినా అది అంత ముఖ్యమా! ఎప్పుడు చనిపోతేనేం?'' అసహ నంగా అన్నాడు శామ్.

''పేషెంటు కుటుంబానికి మీ మీద ఎంతో నమ్మకం వుందని అన్నారు. అయినా దేని గురించో మీరు భయపడుతున్నట్లుగా కనిపిస్తున్నారు. పోలీస్‌లేమన్నా ఈ కేసు విచారిస్తున్నారా?''

''లేదు'' దృఢంగా అన్నాడు శామ్. ''నేను చేసింది తిరుగులేని నేరం. అంతవరకూ ఎందుకు? నేను చేసిన రోగ నిర్ణయం సరైంది కాదని, ఇంకోలా చికిత్స చేస్తే పేషెంట్ బతికుండేవాడని మీరు మాత్రం చెప్పగలరా?''

శామ్ విసిరిన సవాలుకు కొందరు సీనియర్లు ఇబ్బందిగా మొహం పెట్టారు.

''ఇందులో ఏదో చిక్కుముడి వున్నది.'' శామ్ కళ్లల్లోకి గుచ్చి గుచ్చి చూస్తూ డాక్టర్ విలియమ్ నెమ్మదిగా గొణిగాడు.

''సర్... ఉన్న చిక్కుముడి అల్లా కేసులో వున్న క్లిష్టతే! అందరికీ రొటీన్ కేసులు కావాలి. నేరాలు, సాదాగా వుండాలి- ఇంతకు ముందు నా సీని యర్లు చెప్పిన కేసుల్లా!'' శామ్ కొంచెం నిర్మొహ మాటంగానే అన్నాడు.

ఒక సీనియర్ సర్జన్ మృదువుగానే ''రోగ నిర్ధా రణ క్షుణ్ణంగా జరపపలేదనడానికి డాక్టర్ శామ్ కేసు ఒక నిదర్శనం. రోగిలో అతను గమనించా నన్న లక్షణాలు చాలా వ్యాధులను సూచిస్తున్నాయి '' అన్నాడు.

శామ్ మొహం సిగ్గుతో కందిపోయింది. ''నే నున్న పరిస్థితుల్లో నేను తీసుకున్న నిర్ణయం తప్పని, నేనెలా చేస్తే బావుండేదో కాస్త మీలో ఎవ రైనా చెప్పగలరా?'' మళ్లీ రెట్టించాడు.

''రోగి పరిస్థితి విషమించాకే, ఆఖరున అతని పొత్తి కడుపు మెత్తగా లోనికి ముడుచుకుపోవడం గమనించినట్లు చెప్పారు కదా!'' డాక్టర్ డేవిస్ అన్నాడు. ''అదే అయితే పేషెంట్ రోగలక్షణం 'పె రిటోనిటిస్'!''

''అల్సర్ లక్షణం కాక పేగుల్లో చిల్లుపడడం!'' మరో సర్జన్ విడమర్చాడు.

శామ్ మరోసారి మొహానికి పట్టిన చెమట తుడుచుకున్నాడు. నేల చూపులు చూస్తూ, ''ఆహార నాళానికి కాని పేగుకు కాని రంధ్రం పడి వుంటుందని నాకు తట్టనే లేదు.'' అన్నాడు.

''అలా కూడా ఆలోచించవలసిందే కదా!'' డాక్టర్ కర్లిఫ్ చిరునవ్వు నవ్వాడు.

''సరే...సరే...'' అంటూ డాక్టర్ విలియమ్ అడ్డు వచ్చాడు. ''మనం ఎక్కడికో పోతున్నాం.

అసలు విషయం పెర్‌ఫోరేషన్... పొట్టలో అలా రంధ్రం పడడానికి కారణం? అది ఎలా జరిగింది?''

''రోగి 17 ఏళ్ల యువకుడు. పసివాడేం కాదు. గుండు సూదులు మింగడానికి!'' డాక్టర్ కర్టిఫ్ జవాబిచ్చాడు.

''నాకొకటి అనిపిస్తోంది...''డాక్టర్ వుడ్ చెప్పడం మొదలుపెట్టాడు. ''రోగి నాన్‌వెజ్ తీసుకుని వుంటాడు. చిల్లిపడడానికి కారణం చికెన్ బోన్ అయ్యే అవకాశం లేదు. అద్దైతే అన్నవాహిక మధ్యలో ఇరుక్కుపోతుంది కానీ పొట్ట లోపలి వరకూ వెళ్లదు కదా!''

''చూశారా డాక్టర్ శామ్!'' అన్నాడు డాక్టర్ విలియమ్. ''రోగికి చావు తెచ్చి పెట్టిన కారణాలు తగ్గించుకుంటూ వస్తున్నాం. కేసు ఒక కొలిక్కి వస్తోంది. పొత్తికడుపు అతి మెత్తగా మారడానికి కారణం, రోగి శరీరంలో ఇన్‌ఫెక్షన్ చోటు చేసుకోవడమే! అలా అంత రోగం అతనిలో వ్యాప్తి చెందడానికి కారణం- అల్సర్ లాంటిది కాదు. పేగులో చిల్లిపడడమే! అలా కన్నం పడడానికి కారణం అతడు మింగిన ఏదో పదార్థం! చికెన్‌బోన్, గుండు సూదులు కావన్న విషయం మనం తేల్చేసాం... ఇక మన ఊహకు మిగిలింది ఒకే ఒక వస్తువు!''

''చిన్న చేప ఎముక!'' డాక్టర్ స్వీనీ ఆనందంగా అరిచాడు. ''పేషెంట్ చేపల పులుసు తీసుకొని వుంటాడు.''

''సరిగ్గా చెప్పారు'' ఒక సీనియర్ డాక్టర్ తల పంకిస్తూ అన్నాడు.

సీనియర్లు చెప్పింది డాక్టర్ శామ్ శ్రద్ధగా విన్నాడు.

చివరగా డాక్టర్ విలియమ్ తన తీర్పు ఇచ్చాడు. ''మనం ఇప్పుడు ఒక ఏకాభిప్రాయానికి వచ్చాం. డాక్టర్ శామ్ పేషెంట్ అల్సరేటివ్ కోలిటిస్‌తో బాధపడుతున్నాడని, దానికి మందులిచ్చి చికిత్స చేశాడు. అయితే పేషెంట్‌కి కావలసింది అది కాదు. ఒక చిన్న శస్త్ర చికిత్స. ఆపరేషన్ చేసి చేప ఎముక ముక్కను తొలగించి వుంటే అతడు బతికి వుండేవాడు!''

డాక్టర్ శామ్ ఒక్క ఉదుటున తను కూచున్న చోటి నుంచి లేచాడు. స్టాండ్ మీదున్న కోటును వేసుకొని ముఖ ద్వారం వైపు వడివడిగా అడుగులు వేయసాగాడు.

''ఎక్కడికి వెళుతున్నారు? మన మీటింగ్ ఇంకా పూర్తి కాందే!'' అని డాక్టర్ విలియమ్ శామ్‌ని వెనక్కి పిలిచాడు.

శామ్ కోటు వేసుకున్నాడు. ''క్షమించాలి. అట్టే వ్యవధి లేదు. నా కేసులో ఏదో చిక్కుముడి వుందని మీరు సరిగ్గానే ఊహించారు. అదేమిటంటే- నా పేషెంట్ ఇంకా బతికే వున్నాడు. గత రెండు వారాలుగా అతడికి అల్సర్ వుందని ట్రీట్ చేస్తున్నాను. ఇవాళ మధ్యాహ్నం నాకెందుకో అనిపించింది.- నా డయాగ్నోసిస్ తప్పు అని, ఇంకో 24 గంటల్లో రోగికున్న నిజమైన సమస్య ఏమిటో తెలుసుకోలేకపోతే అతడు చనిపోవడం ఖాయం అని! మీ మీటింగ్ ఇవాళే జరగడం, దానికి నన్ను మీరు పిలవడం నా అదృష్టం! మీ డయోగ్నోసిస్‌కి ధన్యవాదాలు. అది నా పేషెంట్‌ని బతికించడానికి ఎంతో ఉపయోగపడుతుంది.'' అని అన్నాక శామ్ బయటకు నడిచాడు.

సరిగ్గా అరగంట తరువాత 'X' క్లబ్‌లోని సర్జన్లంతా సెయింట్ మైకేల్ హాస్పిటల్‌లోని ఆపరేషన్ రూంలోకి చేరారు. డాక్టర్ శామ్ తన సర్జరీ మొదలుపెట్టాడు. నిశ్శబ్దంగా వారంతా చూస్తూ ఉండిపోయారు. నిమిషాలు గడిచిపోతున్నాయి. పక్కనే వున్న నర్సులు అతను అడిగినవి అందజేస్తున్నారు. వారి చేతులు రక్తంతో తడిసిపోయాయి.

పధ్నాలుగు మంది పేరెన్నికగన్న సర్జన్లు, చేప ఎముక మింగి అపస్మారక స్థితిలో వున్న రోగి మొహం కేసి చూస్తూ ఉండిపోయారు.

డాక్టర్ శామ్ తన గ్లవ్స్ తొడుక్కున్న చేతి వేళ్ల మధ్యనున్న ఒకదాన్ని ఎత్తి పట్టుకున్నాడు.

''నర్స్, దీనిని శుభ్రంగా కడిగాక, అదేమిటో వీరందరికీ చూపించండి.!'' పక్కనున్న నర్స్‌తో అన్నాడు.

ఎక్స్ క్లబ్ అధ్యక్షులు ముందుకొచ్చారు. నర్సు అందించిన దానిని చేతిలోకి తీసుకున్నాడు. ''చేప ఎముకే!'' అందరికి వినపడేటట్లు గట్టిగా అన్నాడు.

ఏదో అమూల్యమైన వస్తువుని చూడడానికి అన్నట్లు ఎక్స్‌క్లబ్ సభ్యులంతా దాని చుట్టూ మూగారు.

మూడువారాల తరువాత పేషెంట్ పూర్తిగా కోలుకుని కవిత్వం మొదలుపెట్టాడు.

★

# అందం అనుపమానం

కొంతమంది తారలు ఏం తింటారో, వారి జీవనవిధానం ఏంటో తెలీదుగానీ ఎప్పుడూ చెరగని అందంతో మెరిసిపోతూ ఉంటారు. 'ఇతరుల కెరీర్ గురించి ఆలోచించే తీరిక నాకు ఉండదు. నా వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసే పాత్రలకే నేను ఓకే చెప్తాను' అంటోంది ఎవర్‌గ్రీన్ తార రేఖ. ఈమధ్య బిగ్‌బి పుట్టిన రోజు సందర్భంగా ఆయనకి శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చిన రేఖ పాత్రికేయులతోనూ ఇష్టాగోష్ఠిగా మాట్లాడింది. 'అమితాబ్ నాకు గురువులాంటివారు. ఆయన నుంచి నేను చాలా నేర్చుకున్నాను. చిత్రసీమకు ఆయన ఓ అసెట్' అని చెప్పిన అందాలభరిణె తన అందం రహస్యం గురించి మాత్రం చెప్పలేదు.

